# అమ్మకడుపు చల్లగా - 2

## - గొల్లపూడి మారుతీరావు



స్వర్గీయ గొల్లపూడి మారుతిరావుగారి ఆత్మకథ 'అమ్మకడుపు చల్లగా' ఇప్పటికి 11 సంవత్సరాలుగా మార్కెట్‌లో ఉన్న సంగతి పాఠకులకు విదితమే. అందులో మారుతిరావుగారు 2007 వరకూ తన జీవితంలో జరిగిన సంఘటనలను అత్యంత ఆసక్తికరంగా పాఠకులకు అందించారు. దానికి కొనసాగింపుగా 2007 నుంచి తనజీవితంలోని ముఖ్యమైన సంఘటనలను, క్రిందటి సంవత్సరమే, వ్రాయడం ప్రారంభించారు. అనారోగ్యకారణాలవల్ల దాన్ని పూర్తిచేయలేకపోయారు. ఆయన వ్రాసిన కొద్దిపేజీలను వ్రాసిన వెంటనే, 2018 నవంబర్‌లో, కౌముదికి పంపించారు. పూర్తిచేసి ఉంటే ఆ పుస్తకానికి ఏమి పేరు పెట్టి ఉండేవారో! ఆ అసంపూర్తి రచనను అమ్మకడుపు చల్లగా - 2 గా కౌముది పాఠకులకు ఈ నెల నుంచి ధారావాహికంగా అందిస్తున్నాం.

(ప్రారంభం)

వయస్సు అరవై దాటాక సాధారణంగా జీవితం ఈడిగిలపడుతుంది. జీవనయానం మాగన్ను పెడుతుంది. అంతవరకూ చేయగలిగిన పనులు అసాధ్యంగా కనిపిస్తాయి. తెలీని నిస్త్రాణ జీవితాన్ని ఆవరించుకుంటుంది. ఇది వృద్ధాప్యమనే ముసురుకి సూచన.

కానీ నా జీవితంలో ఇదేదీ జరగలేదు. ఎప్పటిలాగే రోజులు పరుగులు తీశాయి. ఏ నలభయ్యో యేటనో తిరిగిన మలుపులు విశ్వరూపం దాల్చి ఎప్పటికప్పుడు బులిపించాయి. మనస్సూ, శరీరమూ వయస్సు మీద ముసుగు కప్పి ముందుకు తోసుకుని నడిపించాయి. అందుకే ఈ రెండో భాగం. ఇది ముగింపుకి ప్రారంభం కాదు. ప్రారంభానికి కొనసాగింపు.

నన్ను కొందరు అడుగుతుంటారు. మీ పిల్లల్లో ఎవరయినా మీ వ్యాసంగం వేపు తొంగి చూశారా అని. తొంగి చూడడమే కాదు. ఒక కుర్రాడు సినీమా వ్యాసంగంలో పూర్తిగా మునిగి ఇంక తేలలేదు. మా ఆఖరి అబ్బాయి - శ్రీనివాస్. ఇది చరిత్ర.

ఇక, మా పెద్దబ్బాయి సుబ్బారావు చదువు ఏవో కారణాలకి మొదట్నుంచీ సరిగా సాగలేదు. దరిమిలాను పూనుకుని మిత్రుల సహాయంతో బియ్యే చదివి అవుననిపించాడు. అయితే డిగ్రీల ప్రమేయం లేని చురుకుదనం కలవాడు. అతనికిప్పుడు 56. ఓ రోజు ఉదయం సుబ్బారావు నా గదిలోకి దూసుకు వచ్చాడు. "నేను ఎమ్మే పరీక్షకి వెళ్తాను" అన్నాడు. అప్పటికి అతనికి 45 సంవత్సరాలు. ఏమయింది ఇతనికి? ఎందుకీ హఠాత్ పరిణామం? సమాజ సంస్కారమే కాక, కుటుంబ సంస్కారం కూడా అతణ్ణి రెచ్చగొడుతూ ఉండాలి. అతని తమ్ముడు మధ్యవాడు రామకృష్ణ ఇంగ్లీషు సాహిత్యంలో ఎమ్మే ఎం.ఫిల్.

సరే. చదువు ఏనాడూ ఆక్షేపణ కాదు. ఏం చేస్తావు? అన్నాను. ఇంగ్లీషు సాహిత్యంలోనే ఎమ్మే చదువుతానన్నాడు. నన్ను ప్రశ్న అడిగిన మిత్రులు గమనించాలి. ఓ రచయిత, నటుడి పెద్ద కొడుకు జీవితంలో ఆలశ్యంగా సాహిత్యం వేపు. అదిన్నీ ఇంగ్లీషు సాహిత్యం వేపు దృష్టిసారించాడు. అభ్యంతరం ఏముంది? నేనూ, మా రెండో అబ్బాయీ అతనికి గురువులం అయాం.

తమ్ముడు అన్నగారికి పాఠాలు చెప్పాడు. మద్రాసు యూనివర్సిటీకి పరీక్ష కట్టాడు. నేను బెర్టోల్ట్ బ్రెక్ట్, హెరాల్డ్ పింటర్, శామ్యూల్ బెకెట్, టెన్నిసీ విలియమ్స్ (ఎ స్ట్రీట్ కార్ నేమ్డ్ డిజైర్) వంటి రచయితల రచనల్ని చెప్పాను. ఆంగ్ల సాహిత్యంలో ఎప్పుడూ ఉండే కోర్స్ - షేక్స్పియర్. అదొక ప్రత్యేకమైన పేపరు. ఆ పేపర్లో ఏ ప్రశ్న వచ్చినా షేక్స్పియర్ గురించి రాసే రెండు పేజీల ఉపోద్ఘాతాన్ని తయారు చేశాను. ఇవికాక ప్రముఖ తెలుగు రచయిత బుచ్చిబాబు 'చివరకు మిగిలేది' ఒక పాఠ్యపుస్తకం. అది నాకు నల్లేరు మీద బండి. ఆడుతూ పాడుతూ చెప్పాను.

మరొక్కసారి - సుబ్బారావు మేధకుడు కాదు. ఎమ్మే పదిహేడూ పేపర్లు చదివి, పరీక్ష రాసి అన్నింటినీ మొదటి ప్రయత్నంలోనే పాసయిపోయాడు. ఇప్పుడతను ఎమ్మే. మరొక ఆలోచన అతణ్ణి నిలదీస్తోంది. తమ్ముడు ఎం.ఫిల్, తానూ ఎంఫిల్ చేస్తానన్నాడు. భేష్ విజ్ఞానం వ్యసనం. డిగ్రీకోసం కాక కేవలం ఉత్సాహంతో సాగిన చదువిది. ఇప్పటి పరీక్షలో గెలుపు వెన్నుతట్టింది. సరే ఎం.ఫిల్ సబ్జెక్టు ఏమిటి? హెరాల్డ్ పింటర్ "లుక్ బాక్ ఇన్ ఏంగర్" అతని మనస్సుని బాగా ఆకట్టుకుంది. అది ఒక విధంగా దాదాపు పదిహేనేళ్ళ కిందట నా నాటకానికి స్ఫూర్తి - 'జగన్నాటకం.' నా మీదా, చాట్ల శ్రీరాములు మీదా ఉన్న అభిమానంతో ఆ రోజుల్లో సాలూరులో నాకు జరిగిన సన్మానం తరువాత ప్రదర్శించిన 'జగన్నాటకం' చూడడానికి వచ్చాడు సుబ్బారావు.

నాది ఓ ఆలోచన. ఈ రెండు నాటకాలనూ కలిపి సంధిస్తే? రెండింటిలోనూ ప్రధాన పాత్ర పెట్టుబడి - ఆవేశం, ఆగ్రహం. దేనిమీద? ఎందుకు? ఇదీ పరిశోధనకి ప్రాతిపదిక. శీర్షిక వచ్చేసింది. The Colour Of Anger In East And West (A commparitive study of john Osborne's "Look back in Anger" and Gollapudi Maruthi Rao's "Go To Hell" )

నా తెలుగు నాటకాన్ని ఈ దృష్టితో చదివి సుబ్బారావు నిర్ఘాంతపోయాడు. "చదువుతూంటే నేను ఊహించినదానికంటే పవర్ఫుల్గా ఉంది. నీ పాత్ర జెన్నీ (ఆస్బార్న్ పాత్ర) కంటే ఎన్నో రెట్లు శక్తివంతంగా ఉంది" అన్నాడు.

అయితే మద్రాసు యూనివర్సిటీ రూల్స్ ప్రకారం బతికున్న రచయితల మీద పరిశోధనకి అవకాశం లేదు. కనుక తప్పనిసరిగా దగ్గరగా ఉన్న శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఎంపిక చేశాం. నాకు మంచి మిత్రుడు, అభిమాని మధురాంతకం నరేంద్ర. వాళ్ళ నాన్నగారు, ప్రముఖ రచయిత మధురాంతకం రాజారాంగారు నాకు మిత్రులు. నేను చిత్తూరులో పనిచేసే రోజుల్లో (1960 -63) ఒకటి రెండుసార్లు ఆయన ఊరు దామల చెరువు వెళ్ళాను. అక్కడ మరొక మిత్రుడు కలువకొలను సదానంద. దామల చెరువులో రాజారాంగారు తెలుగు పండితుడు.

ఇప్పుడు సుబ్బారావుని తీసుకుని తిరుపతి వెళ్ళాను. ఆనందంగా ఆయనకి 'గైడ్'గా ఉండడానికి నరేంద్ర అంగీకరించారు. ఇక్కడ అనుకోని విచిత్రం నరేంద్ర నాన్నగారు నాకు మిత్రుడు. నరేంద్ర మా అబ్బాయికి గురువు.

మా అబ్బాయితో నరేంద్ర అన్నారట: I am thrilled. Normally it takes 6 months to select the subject. Your father is brilliant. He gave a subject which is a ocean

అయితే - పరిశోధన (నిజానికి ఎం.ఫిల్ అంటే సుదీర్ఘమయిన పరిశోధన వ్యాసం) ఇంగ్లీషులో జరగాలి. నా నాటకాన్ని ఇంగ్లీషులో ఉదహరించాలి. కానీ నాటకం తెలుగు నాటకం. ఎలా? అప్పుడు కూర్చుని కేవలం మా అబ్బాయి పరిశోధనకు 'గో టు హెల్' తెలుగు నాటకాన్ని పూర్తి ఇంగ్లీషులో వ్రాశాను. తీరా పూర్తయ్యాక మిత్రులు, ఇంగ్లీషు లెక్చరర్ అవసరాల రామకృష్ణారావుగారికి చూపించాను. idiomatic సవరణలు సూచించమని. ఆయన సమీక్ష:

*"నేను మూర్ఛపోయాను. చాలా బాగా రాశారు. ఇది నా ఆలోచనలకి దగ్గర. ఇది ఎం.ఫిల్.కి మంచి సబ్జెక్టు. ఇప్పుడు నాకు తెలుగు నాటకం చదవాలని ఉంది."*

నాటక ప్రయోక్త తన చిన్నతనం నుంచీ ఎరిగిన చాట్ల శ్రీరాముల్ని హైదరాబాదు నుంచి పిలిపించి సమగ్రంగా ఇంటర్వ్యూ చేశాడు.

సంవత్సరం తిరగకుండా సుబ్బారావు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఎం.ఫిల్ డిగ్రీ పుచ్చుకున్నాడు. ఇదీ ఆయన గురువు, మిత్రుడు మధురాంతకం నరేంద్ర స్పందన.







ఇంత చెప్పినా అడపా తడపా మిత్రులు అడిగిన సందేహం నివృత్తికాదు. మా పిల్లల్లో ఎవరయినా నా వ్యాసంగం వేపు ప్రయాణం చేశారా అన్నది.

కథ ఇంకా ఉంది. మా అబ్బాయి డిగ్రీ పుచ్చుకున్నాక లండన్ వెళ్ళి వారం రోజులపాటు క్రైం నవలా రచన' మీద కోర్స్ చేసి వచ్చాడు. వస్తూనే ఒక క్రైం నవలా రచనకి ఉపక్రమించాడు. ఒక్క అక్షరంతో నా ప్రమేయం లేదు. నవల పేరు - No Murder Tonight పుస్తకాన్ని ఒక ఆంగ్ల ప్రచురణకర్త ప్రచురించాడు.

ఆ నవలని ప్రముఖనటుడు, మా కుటుంబానికి ఆప్తుడు కమల్ హాసన్ ఆవిష్కరించాడు. 60 ఏళ్ళ కిందట నా తొలికథని, నవలని ఎవరయినా చదివారో లేదో గుర్తులేదు. కాలం మారింది. మాధ్యమాలకు వయసొచ్చింది. కాగా, సుబ్బారావు ప్రముఖ నటుడు, రచయిత కొడుకు. పరపతి సగం కలిసొచ్చింది. నవల మంచి హిట్.

వెంటనే పూనుకుని రెండేళ్ళపాటు మరొక నవల. ఈసారి మాములు నవల రాశాడు A Missed Beat. దీన్ని వెంటనే ప్రచురించారు. ఇది చాలా పాపులర్ అయింది. డక్కన్ క్రానికల్‌లో ఈ నవల మీద సమీక్షలో కొన్ని వాక్యాలు.

The Writing craft of Subbarao whose father GollapuDi Maruthi Rao, a well Known Telugu author and play wright, in this racy narrative lives up to a rat tace of post colonial society (15-10-2018).

మరి రెండో అబ్బాయి రామకృష్ణ? కొన్నాళ్ళు లెక్చరర్‌గా పనిచేశాడు. చక్కని వ్యాపారి. నేను అప్పుడప్పుడు అంటూంటాను. "నేనూ వ్యాపారినే. కొన్నాళ్ళు ముఖాన్ని నమ్ముకున్నాను. ఇప్పుడు ముఖాన్ని అమ్ముకుంటున్నాను" అని. ఆలోచనని అమ్మడంలో మౌలికమైన లక్షణాలు కలవాడు.

ఇప్పుడు మిత్రుల సందేహాన్ని తీర్చాలనుకుంటాను.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*